యుద్ధం అంచున ప్రపంచం!

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మూడో ప్రపంచ యుద్ధ భయాలు

- ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి దిగిన ఇరాన్
- ప్రతీకారేచ్ఛతో రగులుతున్న ఇజ్రాయెల్
- ఇజ్రాయెల్‌కు అమెరికా, నాటో మద్దతు
- ఇప్పటికే ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా
- ఇరాన్‌కు సైతం మద్దతు ఇచ్చే అవకాశం!

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: ఒకవైపు ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రత్యక్ష దాడితో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. మరోవైపు లాంగ్ రేంజ్ క్షిపణుల ప్రయోగిస్తామంటూ ఉక్రెయిన్, అణు విధానం మార్చుకుంటామంటూ రష్యా చేస్తున్న హెచ్చరికలతో ఉక్రెయిన్ – రష్యా యుద్ధం మరింత తీవ్రంగా మారుతున్నది. ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌కు అమెరికా, నాటో దేశాల మద్దతు, ఇరాన్‌కు రష్యాతో పాటు అమెరికా వ్యతిరేక శక్తుల మద్దతు ఉంటుందనే అభిప్రాయాలు ప్రాంతీయ ఉద్రిక్తతలను ప్రపంచ యుద్ధం దిశగా నడిపిస్తున్నాయి. దీంతో మూడో ప్రపంచ యుద్ధానికి గతంలో ఎన్నడూ లేనంత సమీపానికి ప్రపంచం చేరుకున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియాలోనూ వరల్డ్ వార్ 3 అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌గా మారింది. మరోవైపు అధ్యక్ష ఎన్నికల వేడి మీదున్న అమెరికాలో ఇది ఎన్నికల అంశంగా మారింది. మూడో ప్రపంచ యుద్ధం అంచుకు చేరుకుంటున్నామని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

ఇక ఇజ్రాయెల్ వర్సెస్ ఇరాన్

గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనా నుంచి హమాస్ జరిపిన దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలయ్యాయి. హమాస్‌కు అండగా లెబనాన్ కేంద్రంగా పని చేసే హెజ్బొల్లా, యెమెన్ నుంచి పని చేసే హౌతీలు, ఇరాక్, సిరియా నుంచి మిలీషియాలు ఇజ్రాయెల్‌పై దాడులు జరుపుతున్నాయి. ఈ అన్ని సంస్థలకూ ఇరాన్ మద్దతు ఉందనేది ఇజ్రాయెల్ ఆరోపణ. ఇంతకాలం హమాస్‌ను ప్రధానంగా లక్ష్యంగా చేసుకొని గాజాపై భారీగా దాడులు చేసిన ఇజ్రాయెల్ ఇప్పుడు హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుంది. వందలాది పేజర్ల పేల్చేయడం, హెజ్బొల్లా నేత సయ్యద్ హస్సన్ నస్రల్లాను హతమార్చడం, లెబనాన్‌పై భూతల దాడులు ప్రారంభించడం ద్వారా హెజ్బొల్లాను తుదముట్టించే పనిలో ఇజ్రాయెల్ ఉంది. అయితే, ఇంతకాలం ఇజ్రాయెల్ వ్యతిరేక సంస్థలను వెనకుండి నడిపించిన ఇరాన్ మంగళవారం ఇజ్రాయెల్‌పై 180 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగింది. దీంతో ఇప్పుడు పశ్చిమాసియాలో అధికారికంగా ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య యుద్ధం మొదలయ్యింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నది.

ఏ దేశం ఎవరి వైపు?

ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధంలో ఏ దేశం ఎవరి వైపు నిలవనున్నది అనే అంశం కీలకంగా మారింది. ఇజ్రాయెల్‌కు ప్రధాన మద్దతు అమెరికా నుంచి ఉంది. ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని ఇప్పటికీ అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆదేశించారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా పశ్చిమాసియాకు అమెరికా అదనపు బలగాలను మోహరిస్తున్నది. యూకే, ఫ్రాన్స్‌తో పాటు నాటో దేశాల మద్దతు కూడా ఇజ్రాయెల్‌కు ఉండనుంది. మరోవైపు పశ్చిమాసియాలో ఇప్పటికే షియా ముస్లింల కేంద్రమైన ఇరాన్, సున్నీ ముస్లింల మెజారిటీ కలిగిన సౌదీ అరేబియా మధ్య ఆధిపత్య పోరు ఉంది. అమెరికాకు సౌదీ అరేబియా మిత్రదేశంగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాతో పాటు జోర్డాన్ మద్దతు కూడా ఇజ్రాయెల్‌కు ఉండే అవకాశం ఉంది. ఇక, ఇరాన్‌కు సిరియా, లెబనాన్, యెమెన్ మద్దతు ఉంది. ఈజిప్ట్, టర్కీ కూడా ఇరాన్‌కు మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి.

రష్యా దిగితే రణరంగమే!

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం మూడో ఏడాదికి చేరుకున్నప్పటి సమీప భవిష్యత్తులో యుద్ధానికి ముగింపు కనిపించడం లేదు. ఉక్రెయిన్‌కు లాంగ్ రేంజ్ క్షిపణులు అందించాలనే యూకే నిర్ణయంపై రష్యా ఆగ్రహంగా ఉంది. తమ అణు విధానాన్ని మార్చుకుంటామని ఆ దేశం పదేపదే అమెరికా, నాటో దేశాలను హెచ్చరిస్తున్నది. రష్యాకు పరోక్షంగా చైనా, ఉత్తర కొరియా మద్దతు ఉంది. ఇరాన్‌తోనూ రష్యాకు మంచి సంబంధాలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, దాని మిత్ర దేశాలపై ఆగ్రహంగా ఉన్న రష్యా కనుక ఇరాన్‌కు మద్దతుగా నిలిస్తే మూడో ప్రపంచ యుద్ధానికి మరింత చేరువైనట్టే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇజ్రాయెల్ దాడుల ధాటికి బీరుట్‌లో నేలమట్టమైన ఓ అపార్ట్‌మెంట్

ఇజ్రాయెల్-హెజ్బొల్లా భీకర పోరు

- లెబనాన్ భూభాగంలోకి ఇజ్రాయెల్ సైన్యం
- నిలువరించేందుకు హెజ్బొల్లా ప్రయత్నం
- 8 మంది ఇజ్రాయెల్ సైనికుల మృతి
- ఇజ్రాయెల్‌పై 100 రాకెట్లతో హెజ్బొల్లా దాడి
- లెబనాన్‌కు మరిన్ని ఐడీఎఫ్ బలగాలు
- గాజాపై ఇజ్రాయెల్ దాడి.. 51 మంది మృతి

బీరుట్, అక్టోబర్ 2: ఇజ్రాయెల్ దళాలు – హెజ్బొల్లా మధ్య పోరు తీవ్రమైంది. హెజ్బొల్లా లక్ష్యంగా లెబనాన్‌పై గత కొన్ని రోజులుగా గగనతల దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ఇప్పుడు భూతల దాడులను ప్రారంభించింది. లెబనాన్ భూభాగంలోకి చేరుకొని హెజ్బొల్లాపై దాడి చేస్తున్నది. దీంతో ఇజ్రాయెల్ – హెజ్బొల్లా బలగాలు ముఖాముఖి తలపడుతున్నాయి. లెబనాన్‌లోని కఫ్ర్ కిలా గ్రామంలో ఇజ్రాయెల్ సైనికులు మకాం వేసిన ఓ భవనాన్ని పేల్చేశామని హెజ్బొల్లా ప్రకటించింది. ఈ దాడిలో ఎనిమిది మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. హెజ్బొల్లాతో పోరులో సైనికులను కోల్పోవడం ఇజ్రాయెల్‌కు ఇదే మొదటిసారి. ఒడైస్సె, యరౌన్ ప్రాంతాల్లోనూ ఇజ్రాయెల్ బలగాలపై దాడులు చేసి, నష్టం కలిగించామని హెజ్బొల్లా తెలిపింది. దీంతో ఈ ప్రాంతాలను సైతం ఇజ్రాయెల్ సైనికులు వదిలి వెనక్కు వెళ్లిపోయినట్టు పేర్కొన్నది. సరిహద్దులో ఇజ్రాయెల్ సైనిక శిబిరాలే లక్ష్యంగా 100 రాకెట్లతో దాడి చేసినట్టు హెజ్బొల్లా మీడియా అధికారి మొహమ్మద్ అఫీఫ్ ప్రకటించారు.

సరిహద్దుకు భారీగా ఇజ్రాయెల్ దళాలు

హెజ్బొల్లాపై పోరును మరింత తీవ్రం చేసే లక్ష్యంతో లెబనాన్ సరిహద్దుకు దాదాపు 10 వేల మంది సైన్యాన్ని తరలించాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది. సరిహద్దుల్లో దాడులు తీవ్రతరం చేయనున్న నేపథ్యంలో దక్షిణ లెబనాన్ సరిహద్దున ఉన్న మరో 24 గ్రామాల ప్రజలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా ఇజ్రాయెల్ మిలిటరీ హెచ్చరించింది. లెబనాన్‌పై గగనతల దాడులను ఇజ్రాయెల్ కొనసాగిస్తున్నది. తూర్పు లెబనాన్‌లోని బెకా వ్యాలీపై బుధవారం దాడి చేసింది. దక్షిణ బీరుట్‌లోనూ ఇజ్రాయెల్ ఐదు పేలుళ్లు జరిపింది.

గాజాపై మరోసారి ఇజ్రాయెల్ దాడి

కొన్ని రోజులుగా గాజా స్ట్రిప్‌పై దాడులకు విరామం ఇచ్చిన ఇజ్రాయెల్ మంగళవారం రాత్రి నుంచి మరోసారి బాంబుల వర్షం కురిపిస్తున్నది. గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 12 మంది పిల్లలు, ఏడుగురు మహిళలు సహా 51 మంది మరణించారు. సహాయక శిబిరాలపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడిందని పాలస్తీనా వర్గాలు ఆరోపించాయి. కాగా, సిరియా రాజధాని డమాస్కస్‌పైనా ఇజ్రాయెల్ దాడి చేసింది. పశ్చిమ డమాస్కస్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు మరణించారు.

నెక్ట్స్ టార్గెట్ ఖమేనీ!

- ఇజ్రాయెల్ తదుపరి లక్ష్యం ఇరాన్ టాప్ లీడరే!
- సంచలనంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వీడియో సందేశం

జెరూసలెం: ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల దాడితో పశ్చిమాసియా మొత్తం నిప్పుల గుండంలా మారింది. ఏ క్షణాన ఏం జరగబోతున్నదో తెలియటం లేదు. ఇరాన్ దాడిపై నెతన్యాహూ స్పందిస్తూ.. 'ఇరాన్ నాయకులు మా బలాన్ని, ప్రతిదాడి సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేశారు. వారు అర్థం చేసుకొనేలా ప్రతి దాడి చేస్తాం' అని స్పష్టంచేశారు. దీంతో ఇజ్రాయెల్ టార్గెట్‌గా ఇరాన్ మారిందన్న సంకేతాలు వచ్చాయి. అటు.. టెల్‌అవీవ్‌పై దాడుల వెనుక, ఆ ప్రాంతంలో అస్థిరత్వానికి ఇరాన్ సుప్రీం లీడరే కారణం అని ఇజ్రాయెల్ సైనికాధికారులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఐడీఎఫ్ గురి ఇరాన్ టాప్ లీడర్ ఖమేనీపై ఉన్నట్టు తెలుస్తున్నది. ఇరాన్‌పై దాడిచేసే క్రమంలో ఆ దేశానికి ఆయువు పట్టులా ఉన్న ఆర్థిక, కమ్యూనికేషన్ వ్యవస్థను దెబ్బతీసే అవకాశాలున్నాయి. చమురు, గ్యాస్, కమ్యూనికేషన్లు, బ్యాంకింగ్ తదితర రంగాలే తమ లక్ష్యం అని ఐడీఎఫ్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

ఇరాన్ మూల్యం చెల్లించాల్సిందే

తమ దేశంపై క్షిపణి దాడులకు పాల్పడి ఇరాన్ పెద్ద తప్పు చేసిందని, ఇందుకు ఆ దేశం మూల్యం చెల్లించాల్సిందేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ హెచ్చరించారు. బుధవారం ఇజ్రాయెల్ భద్రతా బలగాల అధినేతలతో నెతన్యాహూ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇరాన్‌లోని ముఖ్యమైన లక్ష్యాలను తాము గుర్తించి, శక్తిమంతంగా దాడులు చేయగలమని ఇజ్రాయెల్ సైన్యాధ్యక్షుడు హెర్జి హలేవీ హెచ్చరించారు.

ఐరాస చీఫ్‌పై ఇజ్రాయెల్ నిషేధం

టెల్ అవీవ్: ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తమ దేశంలోకి ప్రవేశించకుండా నిషేధం విధిస్తున్నట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. తమ దేశంపై ఇరాన్ జరిపిన క్షిపణుల దాడిని నిర్ద్వంద్వంగా ఖండించడంలో గుటెరస్ విఫలమయ్యారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ బుధవారం పేర్కొన్నారు. ఇరాన్ దాడిని ఖండించలేని ఎవరికీ ఇజ్రాయెల్ నేలపై కాలు పెట్టే అర్హత లేదని కట్జ్ పేర్కొన్నారు.

సంయమనం పాటించండి: భారత్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. సామాన్య పౌరుల రక్షణ కోసం సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. చర్చలు, దౌత్యం ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించింది. కాగా, ఇరాన్‌లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని, తమ కార్యాలయంతో కాంటాక్ట్‌లో ఉండాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని భారతీయులకు సూచించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లోని భారతీయులకూ టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం ఇవే సూచనలు చేసింది. కాగా, ఇరాన్‌లోని తమ దేశస్థులు వెంటనే తిరిగి రావాలని ఫ్రాన్స్ పిలుపునిచ్చింది. ఇరాన్ గగనతలం నుంచి రాకపోకలు వద్దని ఐరోపా ఎయిర్‌లైన్‌లకు యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సెఫ్టీ ఏజెన్సీ సూచించింది.

వీసా ఫీజుల్ని 60% పెంచిన న్యూజిలాండ్

కాన్‌బెర్రా, అక్టోబర్ 2: వృత్తి, పర్యాటకం, విద్య.. సహా అన్ని రకాల క్యాటగిరీల వీసా ఫీజుల్ని న్యూజిలాండ్ భారీగా పెంచింది. ఈ నెల 1 నుంచే ఇవి అమల్లోకి వచ్చినట్టు ఆ దేశం ప్రకటించింది. దీంతో ఉద్యోగం, పర్యాటకం, ఉన్నత విద్య కోసం ఆ దేశానికి వెళ్లే భారతీయులపై ఇది తీవ్ర ప్రభావం చూపనున్నది. స్టూడెంట్ వీసా ఫీజును 188(రూ. 15,787) నుంచి 300 డాలర్ల (రూ.25వేలు)కు, టూరిస్ట్ వీసా ఫీజును 119 డాలర్ల (రూ.10వేలు) నుంచి 188 (రూ.15,787)డాలర్లకు పెంచుతూ న్యూజిలాండ్ నిర్ణయం తీసుకుంది.

జన్ సురాజ్ పేరుతో ప్రశాంత్ కిషోర్ కొత్త పార్టీ

పాట్నా: ఎన్నికల ప్రచార వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బుధవారం జన్ సురాజ్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాల కోసం బీహార్ ప్రజలు ఓట్లు వేయడం లేదని, అందుకే వారికి అవి లభించడం లేదని చెప్పారు. వీటిపట్ల వారికి అవగాహన కల్పించే ఉద్యమమే జన్ సురాజ్ అని వివరించారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు మార్చిలో జరుగుతాయని ప్రశాంత్ కిశోర్ చెప్పారు. అప్పటి వరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి మనోజ్ భారతిని నియమిస్తున్నట్లు తెలిపారు.

'లవ్ జిహాద్'తో దేశ ఐక్యతకు ముప్పు

యూపీ కోర్టు హెచ్చరిక

బరేలీ: లవ్ జీహాద్ మన దేశానికి పెను ముప్పు అని ఉత్తరప్రదేశ్‌లోని ఓ కోర్టు హెచ్చరించింది. ఓ కమ్యూనిటీకి చెందిన సంఘ వ్యతిరేక శక్తులు భారతదేశంపై ఆధిపత్యాన్ని సాధించేందుకు దీనిని ప్రయోగిస్తున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ కుట్ర, మైనారిటీల జనాభాను విపరీతంగా పెంచుకోవడం ద్వారా తమ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారని చెప్పింది. ఓ కేసు విచారణ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి (ఫాస్ట్‌ట్రాక్ కోర్టు) రవికుమార్ దివాకర్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. చట్టవ్యతిరేకంగా మతమార్పిడులకు పాల్పడటం కోసం హిందూ యువతులను ప్రేమ పేరుతో ప్రలోభాలకు గురి చేస్తున్నారని చెప్పారు. పాక్, బంగ్లాదేశ్‌లలో ఉన్న పరిస్థితులను భారత్‌లో కూడా సృష్టించాలనుకుంటున్నారని తెలిపారు. ఈ కేసులో దోషి మహమ్మద్ అలీంకు జీవిత ఖైదు, అతని తండ్రికి రెండేళ్ల జైలు శిక్ష విధించారు.

రష్యా ఆధీనంలోకి మరో ఉక్రెయిన్ పట్టణం

కీవ్: తూర్పు ఉక్రెయిన్‌లోని వుహ్లెదార్ పట్టణాన్ని రష్యా సైన్యం సంపూర్ణంగా తన నియంత్రణలోకి తెచ్చుకుంది. కొండ ప్రాంతంలోని ఈ పట్టణం వ్యూహాత్మకంగా కీలకమైనది. ఈ పట్టణం నుంచి తమ దళాలను ఉపసంహరించుకున్నట్లు ఉక్రెయిన్ సైన్యం బుధవారం ధ్రువీకరించింది. సైన్యం, పరికరాలను పరిరక్షించుకోవడానికి డొనెట్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్‌కు ఈ పట్టణం చాలా ముఖ్యమైనది. ఈ పట్టణం గుండా రష్యా, ఉక్రెయిన్‌లకు రవాణా సదుపాయాలు ఉన్నాయి. మొత్తం డొనెట్స్క్ రీజియన్‌పై పట్టు సాధించడంలో ఇది గొప్ప ముందడుగు అని రష్యా భావిస్తున్నది.

సద్గురు ఏమిటీ బోధనలు?

సొంత కూతురికి పెండ్లి చేసి, ఇతరులను సన్యాసినులుగా ఎందుకు మార్చుతున్నారు?

ఈషా ఫౌండేషన్‌ను ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు

చెన్నై: సద్గురు జగ్గీ వాసుదేవ్ ఓ వైపు తన కుమార్తెకు పెండ్లి చేసి జీవితంలో స్థిరపడేట్లు చేసి, మరోవైపు ఇతర యువతులను సన్యాసినులుగా బతికేలా ఎందుకు ప్రోత్సహిస్తున్నారని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. తన ఇద్దరు కుమార్తెలు బాగా చదువుకున్నారని, వారు పెండ్లి చేసుకోకుండా ఈషా యోగా సెంటర్ బ్రెయిన్ వాష్ చేస్తున్నదని రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరుపుతున్నది. అయితే, 42, 39 సంవత్సరాల వయసుగల ఈ ఇద్దరు మహిళలు సోమవారం హైకోర్టుకు హాజరై, తాము తమ ఇష్ట ప్రకారమే, స్వీయ నిర్ణయంతోనే ఈషా యోగా సెంటర్‌లో ఉంటున్నామని చెప్పారు. ఈషా ఫౌండేషన్‌కు సంబంధించిన అన్ని కేసుల జాబితాను తయారు చేసి, నివేదికను సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. దీంతో దాదాపు 150 మంది పోలీసులు మంగళవారం ఈషా ఫౌండేషన్‌లో తనిఖీలు చేశారు. కాగా పెండ్లి చేసుకోవాలని కానీ, బ్రహ్మచర్యం చేపట్టాలని కానీ తాము చెప్పబోమని ఈషా ఫౌండేషన్ వివరణ ఇచ్చింది.

చైనా సీసీటీవీలపై కేంద్రం ఆంక్షలు?

లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల నేపథ్యంలో నిర్ణయం

సీసీటీవీలతో డాటా లీక్ అయ్యే ప్రమాదం!

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: లెబనాన్‌లో ఒకేసారి వందలాది పేజర్లు పేలిపోవడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఎలక్ట్రానిక్ పరికరాలు శత్రువుల చేతిలో ఆయుధాలుగా మారే ముప్పు ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చైనాలో తయారైన సీసీటీవీ కెమెరాలు, ఇతర నిఘా పరికరాల వినియోగంపై భారత్‌లో ఆంక్షలు విధించాలని భావిస్తున్నది. ఈ మేరకు అక్టోబర్ 8 నుంచి కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. చైనా తయారీ పరికరాలపై ఆంక్షలతో పాటు దేశంలో తయారైన వాటినే వినియోగించేలా ఈ విధానం ఉండనుంది. నిజానికి ఇందుకు సంబంధించిన గెజిట్ గతంలోనే వచ్చినప్పటికీ లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల నేపథ్యంలో ఇప్పుడు అమలులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. కీలక ప్రాంతాల్లో అమర్చే సీసీటీవీల ద్వారా ప్రజల కదలికలు, ఇతర డాటా బయటికి లీక్ అయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో భారత్‌లోనే పూర్తిస్థాయిలో తయారయ్యే పరికరాలను మాత్రమే వినియోగించేలా ఈ విధానంలో చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం భారత మార్కెట్‌లో సీపీ ప్లస్, హిక్‌విజన్, దహువా కంపెనీలు 60 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి. వీటిల్లో సీపీ ప్లస్ భారత్‌కు చెందిన కంపెనీ కాగా, మిగతా రెండు చైనా సంస్థలు. ఇప్పటికే అమెరికా సైతం ఈ కంపెనీల పరికరాల వినియోగంపై ఆంక్షలు విధించింది.

రోజుకో పూట ఉపవాసంతో మధుమేహ నియంత్రణ

న్యూఢిల్లీ: మధుమేహ వ్యాధిగ్రస్తులైనా, హృద్రోగులైనా సరే.. రోజుకు ఒక పూట ఉపవాసం చేస్తే మధుమేహం నియంత్రణలో ఉండటంతో పాటు గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తాజా అధ్యయనం తెలిపింది. ప్రతి 10 గంటలకు ఒకసారి తింటే.. జీవక్రియ మెరుగుపడుతుందని తేలింది. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని, కొలెస్ట్రాల్ తగ్గుతుందని అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్‌డియాగో, సాల్క్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. మెటబాలిక్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న 108 మందిని పరీక్షించగా మెరుగైన ఫలితాలు వచ్చినట్టు పరిశోధకులు తెలిపారు.

ఢిల్లీలో 2 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

500 కిలోల కొకైన్ స్వాధీనం.. నలుగురి నిందితుల అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సుమారు రూ.2 వేల కోట్ల విలువైన 500 కిలోల కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేశారు. దీని వెనుక అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సిండికేట్ ఉందని తెలిపారు. ఢిల్లీలో ఈ స్థాయిలో డ్రగ్స్ పట్టుబడటం ఇదే తొలిసారి. కాగా, ఢిల్లీలోని తిలక్ నగర్ ప్రాంతంలో ఆదివారం ఇద్దరు ఆఫ్గాన్ జాతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి నుంచి 1,660 గ్రాముల కొకెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.24 కోట్లు.

రైతు బిడ్డల్ని 'ఫస్ట్ రేట్' అమ్మాయిలు మనువాడరు!

మహారాష్ట్ర ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబై: వ్యవసాయం చేసే యువకులను అందమైన అమ్మాయిలు పెండ్లి చేసుకోవడం లేదని మహారాష్ట్ర ఎమ్మెల్యే దేవేంద్ర భూయర్ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా, వరుడ్ తహశీల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఓ అమ్మాయి అందంగా ఉంటే, ఆమె పెండ్లి చేసుకోవడానికి నీలాంటి, నాలాంటివాళ్లని ఇష్టపడటం లేదు. ఆమె ఉద్యోగస్థుడినే ఎంచుకుంటున్నది. నంబర్ 2లో, ఓ మోస్తరు అందంగా ఉండే అమ్మాయిలు కిరాణా దుకాణం, పాన్ కొట్టు నడిపే యువకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందంలో తక్కువ స్థాయిలో ఉన్న అమ్మాయిలు రైతుల కుమారులను చేసుకుంటున్నారు' అని అన్నారు. అలాంటివారికి అందగాళ్లు పుట్టడం లేదన్నారు. దేవేంద్ర భూయర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆయన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు మద్దతిస్తున్నారు. దేవేంద్ర వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత యశోమతి ఠాకూర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేతిలో జాతీయ జెండాతో సీఎం బూట్లు విప్పిన కాంగ్రెస్ కార్యకర్త

సిద్ధరామయ్యపై సర్వత్రా విమర్శలు

బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. గాంధీ జయంతిన జాతీయ జెండాను ఘోరంగా అవమానించారు. కాంగ్రెస్ కార్యకర్త ఒకరు ఓ చేతిలో జాతీయ జెండాను పట్టుకుని, మరో చేత్తో సీఎం సిద్ధరామయ్య బూట్లు విప్పడం వివాదాస్పదంగా మారింది. బుధవారం బెంగళూరులో గాంధీ విగ్రహానికి సిద్ధరామయ్య నివాళి అర్పిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

బీహార్‌లో వరద సాయం కోసం వచ్చిన ఐఏఎఫ్ హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో బుధవారం ముజఫర్‌పూర్‌లో ఇలా నీళ్లలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు.

దేశానికి జాతిపితలు ఎవరూ లేరు

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మహాత్మ గాంధీ, లాల్ బహదుర్ శాస్త్రీల జయంతి సందర్భంగా ఆమె సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. 'దేశానికి జాతిపితలు ఎవరూ లేరు. కేవలం కుమారులు మాత్రమే ఉన్నారు. భారతమాతకు ఇలాంటి కుమారులు(లాల్ బహదుర్ శాస్త్రి) ఉండటం అదృష్టం' అని ఆమె వ్యాఖ్యానించారు. మహాత్మ గాంధీని ఉద్దేశపూర్వకంగా కంగనా రనౌత్ తక్కువ చేశారని కాంగ్రెస్ ఆరోపించింది.

అలాంటి వారి ఫొటోలు తీసి పేపర్‌లో వేయాలి: గడ్కరీ

నాగ్‌పూర్: పాన్ మసాలా నమిలి రోడ్లపై ఉమ్మివేసే వారి ఫొటోలు తీసి పేపర్‌లో ప్రచురించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. బుధవారం నాగ్‌పూర్‌లో నిర్వహించిన స్వచ్ఛ్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రజలు చాలా స్మార్ట్. చాక్లెట్ తిన్న తర్వాత కవర్‌ను వెంటనే పారేస్తారు. అదే వారు విదేశాలను సందర్శించినప్పుడు మాత్రం, చాక్లెట్ తిన్నాక కవర్‌ను జేబులో పెట్టుకుంటారు. విదేశాల్లో చక్కగా ప్రవర్తిస్తారు' అని పేర్కొన్నారు.

చెత్తలో దొరికిన పెయింటింగ్ ఖరీదు రూ.54 కోట్లు!

న్యూఢిల్లీ: వాడి పారేసిన వస్తువులను కొనే జంక్ డీలర్‌కు దొరికిన పెయింటింగ్ ఆయన కుటుంబానికి అదృష్టం తీసుకొచ్చింది. ఇటలీలోని జంక్ డీలర్ రోస్సో 1962లో కాప్రిలో ఉన్న ఓ ఇంటిని శుభ్రం చేస్తుండగా ఓ పెయింటింగ్ దొరికింది. దాని మీద పాబ్లో పికాసో సంతకం కూడా ఉంది. దానిని ఆయన పొంపెయిలోని తన ఇంటికి తీసుకెళ్లి, గోడకు తగిలించాడు. దీని గురించి అధ్యయనం చేయగా ఇది పికాసో గీసిన చిత్ర